

కథా కౌముది

# గణార్చన - కేసరి

అప్పుడే పథ్యం కానిచ్చి సోఫాలో వాలాడు - నారాయణ. కరెంటు లేదు. పదకొండింటికే ఎండ మండిపోతోంది. అతని అవస్థ చూసి -

"అలా దొడ్లో యేపసెట్టు కింద మడత కురిసీలో కూకో! నిదరోకుమీ! జొరం తిరగబెడుతుంది!" అంది ఎరకయ్య తల్లి దాలమ్మ.

చేతికందిన పత్రికల బొత్తి అందుకుని దాలమ్మ వేసిన కుర్చీలో చేరి, పేపర్లు తిరగేస్తున్నాడు నారాయణ.

ఆకలి చావులూ - హరాయించుకోలేని విందు వినోదాలూ, గూడులేని జీవాలూ - అవనీతి పునాదుల మీద ఆకాశ హర్మ్యాలు, నిరుద్యోగులకు ఆశల పల్లకీలూ - ఉద్యోగుల జీత భత్యాలకై సమ్మెలూ, రిజర్వేషన్లూ మెరిట్ వాదోపవాదాలూ, ఋణమేళాలూ - మాఫీలూ, నిర్వచనానికి అందని ప్రజా ప్రభుత్వాలూ - ప్రజల్ని భిన్న భిన్న వర్గాలుగా విభజించి పాలిస్తున్న పాలకులు - భస్మాసుర హస్తాలూ, సమస్యలను పరిష్కరించలేక పనికిరాని సమస్యలు సృష్టించి దేశపు పుట్టి ఏదో మునిగి పోతోందన్న భ్రమలకు ప్రజల్ని గురి చేస్తున్న నాయకులూ, ఏలికలూ, ఓటుకోసం తాయిలాలూ, సీటుకోసం తాపత్రయాలూ....

ఆ పైన పేపర్లు చదవ వెగటు పుట్టి, దేశం అంతా ఛండాలంగా ఉందనుకుని కళ్ళు మూసుకున్న నారాయణ - కొంతసేపటికి - ఎవరో తన దగ్గరలో తచ్చాడుతున్న అలికిడి విని, కళ్ళు తెరిచి.

"నిద్దరోటం లే!... కళ్ళు పీకి..." సంజాయిషీగా దాలమ్మతో అన్నాడు అతను.

"అది సరే! రావటమే... ఖాయిలా పడి వస్తివి... మనూరి ఇసేసాలేటి!?" అంటూ ఆత్రంగా ప్రశ్నల వర్షం కురిపించసాగింది - ఆమె. జవాబులు చెబుతూ కూర్చున్నాడు అతను.

అడిగిన ప్రశ్నలే అటు తిప్పి ఇటు తిప్పి అడుగుతోంది - ఆమె. ఆమెను పరిశీలనగా చూసి -

'బేగి.. ఓపాలిరా!! నారాయణా!' అంటూ కబురంపిన దాలమ్మ కనిపించింది ఆమెలో.

"తలకు మించిన అప్పులు చేసాడా!!" అంటూ కొప్పులో వేలెట్టి గోక్కోసాగింది ఆమె. ఫరవాలేదు చెప్పు - అన్నట్లు అతడు చూసిన మీదట -

"అమ్మ... వైద్యం సదువు ఇసయమై.. ఈడూ, కోడలు పిల్లా గొడవొడ్డారు!... అది అలిగి పుట్టింటికి పాయె!" అని గుసగుసగా చెప్పి, "ఏటో! గోల.. నువ్వోపాలి.. నువ్వు నారాయుడివి`... ఆడు నరుడు!" అంది ఆశగా చూస్తూ.

విషయం అర్థమైనట్టుంది నారాయణకి.

"నేను కబురంపేనని ఆడితో అనేవు సుమీ!" కొంపలంటుకుంటాయి అన్నట్టు చూసి, "ఏటి సేస్తవో!.. ఏటి సెబుతావో?... అంతా నీదే బారం. ఆళ్ళు కలిసి సల్లగా కాపరం సేసేలా సూడు. ఆడొచ్చే ఏలయ్యింది. కసిన్ని టీ నీళ్ళు కలిపివ్వనా!" అంటూ లోపలికి వెళ్ళపోయింది దాలమ్మ.

✡✡✡

ఎరకయ్య నారాయణ కన్నా పదిహేనేళ్ళు చిన్నవాడు. వాళ్ళిద్దరిదీ ఒకే పల్లి. తండ్రి సిఫార్సు మీద, పట్నంలో ఎరకయ్య చదువూ, తన సంస్థలోనే అతగాడికో ఉద్యోగం - రిజర్వేషను కోటాలో - వేయించటమూ, పెళ్ళి లాంటి బాధ్యతలు నారాయణ తలకెత్తుకున్నాడు.

అంచేత నారాయణ మాట ఎరకయ్య తలాయించడని దాలమ్మకో నమ్మకం. నూటికి తొంభైపాళ్ళు ఆ విషయం నిజమే.

గడియారం రెండు గంటలు కొట్టింది. గాలి ఆడటం లేదు. కాలింగ్ బెల్ వినిపించింది 'ఎరకయ్య వచ్చినట్లుంది. కరంటు వచ్చినట్లుంది. ఫేను క్రింద కూర్చోవచ్చు' అనుకుంటూ ఇంట్లోకి వచ్చాడు - నారాయణ.

వచ్చింది ఎరకయ్యకాదు. అతని కూతురు అమ్మి ఉరఫ్ సుధారాణి - అల్లం మసాలా టీ వాసనా, ఆ వెనకాల టీ కప్పుతో - అమ్మి. కప్పు అందిస్తూ - తననే పరిశీలనగా చూస్తున్న నారాయణ రెండు చెవులూ చూస్తూ - "మీరెండు చెవులు బాగేనే ఉన్నాయే!" అంది నవ్వుతూ

పెదాల మీద చూపుడు వేలు నిలువునా పెట్టి, గుడ్లురిమి, కూర్చో అన్నట్లు తన ప్రక్క జాగా చూపాడు - నారాయణ. 'భోంచేసి వస్తా!' అన్నట్లు సైగ చేసి తుర్రుమంది - ఆమె.

టీపాయ్ మీద టీ అందుకుని కొద్దిగా చప్పరించాడు. ఏదో సత్తువ వచ్చినట్టయ్యింది. టీపాయ్ క్రింద అరలోని ఫైలూ, డైరీలు చదువరాదు అని తనంటే -

'చాల్లెండి, గురువుగారూ! ఇందులోవి నా స్వవిషయాలు కావు - 'మెరుపులు' - అంటూ బలవంతాన చదివించి, ప్రశ్నార్థకాలు ఉంచిన చోటు - అతనికి అర్థం కానివి - తన చేత వివరించుకోవటం నారాయణకి గుర్తొచ్చింది. డైరీలో.. మొదటి పేజీలో...

'అన్యాయం వల్ల లాభాలు పొందేవాళ్ళు వాళ్ళని అణిచి పారేయటానికి ప్రయత్నం చేస్తారు. అన్యాయాన్ని ఎదిరించేవారు చిట్టచివరికి అన్యాయాల వల్ల బాధపడేవాళ్ళే అవుతారు కానీ మరొకరు అవరు' - రావిశాస్త్రి అర్థం చేసుకున్న విషయం

మెడలోని రుద్రాక్షమాల చెమటకు చిరాకు పెడుతుంటే నారాయణ వాటిని తీసి టీపాయ్ మీద పెడుతుండగా, అటుగా వచిన 'అమ్మి' ఏదో మరచిన దానిలాగా వెనుదిరిగి.... తిరిగి తన పరుసుతో వచ్చి, అందులోంచి ఒక కాగితం తీసి నారాయణకు ఇచ్చింది, 'మీకు పనికొస్తుందేమో చూడండి' అన్నట్లు చూస్తూ. అది -

'శ్రీశ్రీ శ్రీ నూకల సుధాకరానంద స్వామిగారి మంగళా శాసనములతో - చీమల సంతర్పణ -గ్రహచారణ బాధ తొలుగుటకు, జాతకములో గ్రహస్థితులు బాగాలేనప్పుడు ఈదిగువ వ్రాయబడిన విధముగా సంకల్పము చెప్పుకుని చీమలకు సంతర్పణ చేయుచుండిన ఎడల దోషములు తొలిగిపోయి శుభఫలములు కలుగుచుండును.... పుత్ర సంతానము లేని వారూ, భార్య (లేక) భర్త అనుకూలము లేని వారూ పాపము చేసిన వారూ, పలుమార్లు కార్యభంగము నొందుచున్నవారూ - వారివారి ఇష్టానుసారముగా వారి వారి కష్టములను పోగొట్టుకొనుటకై... మమ ఇష్టపడే దేవతా / పార్వతీ పరమేశ్వరానుగ్రహ ప్రాప్యర్థం - ఏ రకమైన అభాగ్యులైతే ఆ అభాగ్య నివారణా, ఆ పైన 'అదృష్ట సిద్ధర్థ్యం, పిపీలకా గణార్చన మహిం కరిష్యే!' - అని సంకల్పము చెప్పుకొనుచు చక్కర గానీ నూకలను గానీ పుట్ట యందలి నల్ల చీమలకు సంతర్పణ చేయుచున్న పక్షమున వారి వారి ఇష్టార్థములు తప్పక సిద్ధించును మరియు చీమలకు సంతర్పణ

చేయుచు శివాలయ మందును విష్ణాలయమందును దీపారాధనలను ప్రదక్షణ నమస్కారాదులను, ఆర్ద్రానక్షత్రము నందు రుద్రాభిషేకములు చేసిన ఎడల మిక్కిలి శీఘ్రముతో తప్పక కార్య సిద్ధి అగునని తెలియదగినది...'

"నీ చేతికెలా వచ్చింది!?" అడిగేడు నారాయణ.

"ఎలాగో ఓలాగ! మంత్రాలకు చింతకాయలు రాలుతాయటండీ!? కష్టే ఫలి - అన్నారు మీలాంటి పెద్దలు" అంది నవ్వుతూ 'అమ్మి'

"సుధా!" కేక వినిపించింది. ఆ పైన ఎప్పుడొచ్చేడో ఉగ్రావతారంతో ముందు కొచ్చాడు - వీధి గుమ్మంలోంచి - ఎరకయ్య. బిత్తరపోయి కన్నీళ్ళ పర్యంతం అయ్యింది 'అమ్మి'.

"ఆగవయ్యా!... తాతనుకాబోతున్నాను కదా!... ఆటలు పట్టించుకోవటం నేర్పుతోంది. అవునా! అమ్మీ!" అన్నాడు నారాయణ - వాతావరణం తేలిక పరుస్తూ

"నిబ్బగా!? ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు.. నీ నోట తీపి బోయా!" అంటూ ఎంత వేగిరంగా హాల్లోకి వచ్చిందో అంత వేగంగానూ వంట ఇంట్లోకి దూరిపోయింది దాలమ్మ.

"భోంచేసి అర్జంటుగా ఆఫీసుకెళ్ళాలి. విశ్రాంతి తీసుకోండి. సాయంత్రం వేగంగా రావడానికి ప్రయత్నిస్తా!" అంటూ వంట ఇంట్లోకి దూరేడు - ఎరకయ్య. నారాయణ వేపు కృతజ్ఞతగా చూస్తూ వంట ఇంట్లోకి దూరింది - 'అమ్మి'.

వంటింట్లోంచి గద్దింపులూ.. క్షమాపణలూ వినవచ్చాయి. నారాయణ చిన్నగా నవ్వుకుంటూ, పేపరు కత్తిరింపులు అందుకున్నాడు.

ప్రస్తుతం రిజర్వేషన్ల మీద జరుగుతున్న దుమారం తాలూకా వార్తల, వాఖ్యానాల... సంపాదకులకు పాఠకుల లేఖల కత్తిరింపులున్నాయి. కొన్ని చోట్ల టిక్కు మార్కులూ, ఇంకొన్ని చోట్ల ఇంటూ మార్కులూ ఉన్నాయి. టిక్కులు ఎరకయ్యకు నచ్చిన అభిప్రాయాలు... ఇంటూలు అతను విభేదిస్తున్నవి.

వాటి క్రింద చీమల గూర్చిన వ్యాసం. వాటిలో కొన్ని పేరాలూ, వాక్యాలూ ఎర్ర పెన్నుతో అండర్ లైన్ చేసి ఉన్నాయి. ఎక్కడా ప్రశ్న గుర్తులు లేవు. 'శిష్యోత్సాహం' కలిగింది నారాయణకి. వాటిక్రింద ఇంకా ఏవేవో కత్తిరింపులు.

"వస్తానండీ!" అంటూ ఎరకయ్యా, "కోచింగ్ సెంటరు" కంటూ 'అమ్మీ' బయటకు వెళ్ళిపోయేరు.

"బేప్!... బేపులు!! ... వాసన పసిగట్టేసాయి" అంటూ నిట్టూర్చింది. దాలమ్మ, వీధి తలుపు వేస్తూ.

✡✡✡

నారాయణ కళ్ళు మూతలు పడుతున్నాయి. మగత నిద్రలో అలలు అలలుగాఏవేవో దృశ్యాలు -

దేశంలో జనం ఎక్కడికక్కడ కురుపాండవ పక్షాల్లా రెండుగా చిలిపోతున్నారు - కాకపోతే వరప్రసాదితులూ... శాపగ్రస్తులులా...

....వాళ్ళల్లో ఒక చీలిక వారు ప్రాబల్యాన్ని పెంచుకుంటున్నారు. వారు ఏదో అదృశ్య హస్తం ప్రాపకంలో ఉంటున్నారు.

...రెండో తెగవారు నిరాదరణకు గురి అవుతున్నారు. వీరి తీక్షణ దృష్టి మొదటి వారి మీదే వీరిలో కొందరు నిరాదరణ గూర్చి -

'ఈ వివక్షత ఎంత కాలం!?' అని ఎలుగెత్తి అరుస్తున్నారు.

'పదవీ వ్యామోహాలు ఉన్నంత కాలం' ఎక్కడినుంచో నిర్లిప్తమైన ఓ జవాబు.

'అలాంటి వాళ్ళు కలకాలం ఉంటూనే ఉంటారు' మరో ఆక్రోశం.

'చూద్దాం!.. చూద్దాం... పాపం పండేకాలం రాకమానదు' అనునయింపు

'అరె! ఎప్పుడు?... ఎన్నేళ్ళకు!?' విసుగుతో కూడిన మూల్గులు.

"నాయనా!" అన్న దాలమ్మ పిలుపుతో కళ్ళు విప్పాడు నారాయణ.

'అమ్మ వచ్చింది" గుసగుసగా చెప్పి పారిపోయింది. ఆమె టైము నాలుగయ్యింది.

"ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా!" అని రాగం తీస్తూ, ఒక చేతిలో మాత్ర, ఇంకో చేతిలో నీళ్ళ గ్లాసుతో వచ్చింది - 'అమ్మి'.

"రా! రా!... కాబోయే డాక్టరమ్మా! రా...రా..." అన్నాడు కుర్చీలో సర్దుకుంటూ నారాయణ.

నీరసంగా నవ్వింది. 'అమ్మి', 'విషయాలు మీ చెవిని పడకపోయుంటాయా! అన్నట్లు చూస్తూ.

"కొంత అర్ధమయ్యిందనుకో! కొంత అర్ధం కాలేదు" అన్నాడు అతను.

"మీ కర్ధం కాకపోవడమేమిటి!? మా నోట చెప్పించాలని కాకపోతే!" చిలిపిగా నవ్వుతూ

"అలాగని కాదు అమ్మ గూర్చి.. మామ్మ బేజారు...' అర్ధోక్తిలో ఆగిపోయాడు అతను.

"ఫైలూ, డైరీలు చూసారు కదా! అమ్మకి నా మీద నమ్మకం లేదు" అంది 'అమ్మి'

"అలా అలా తిరగేసేను. అంతే!... పూర్తిగా చదవలేదు. అంచేత విషయం తెలియ రాలేదు. చెప్పురాదా!' అన్నాడు అతను. ఆమె నుంచీ ఉలుకూ పలుకూ లేదు.

"సరేలే! చెప్పకు. కానీ, ఈ విషయం చెప్పు. నాన్న అభిప్రాయం... నీ అభిప్రాయం ఏదో... ఒకటిలే. అది నీ మీద బలవంతంగా రుద్దలేదు కదా!!" అన్నాడు ఆమెను గుచ్చి గుచ్చి చూస్తూ. "లేదు"... నిజంగా!!"... "గాడ్ ప్రామిస్!" అంటూ కంఠముడి పట్టుకుంది అమ్మి. ఆ పైన -

"బయట పనుంది, వెళ్ళిరానా!" అంది అమ్మి. "ఊ!" అన్నాడు నారాయణ. తలుపుచాటున దీర్ఘంగా విశ్వశించింది దాలమ్మ.

✡✡✡

ఫైలు తిరగేయ సాగేడు - నారాయణ. టిక్కులూ, ఇంటూలూ, అండర్‌లైను చేసిన లైన్లూ, పేరాలు చదువుకుంటూ పోతున్నాడు. అతని కళ్ళు మూతలు పడిపోతున్నా చదవ సాగేడు - అతను. కళ్ళు పీకసాగాయి. చదవడం ఆపి -

'పిపీలకాది బ్రహ్మ పర్యంతం',... అంటే!? ... చీమల నుంచి దేవుడి వరకు చీమల నుంచి దేవుడి వరకు. చీమ... దేవుడు. చిన్నప్పుడు తన అమ్మమ్మ చెప్పిన పిట్ట కథ జ్ఞాపకం వచ్చింది. అతనికి.

పాము దేవుని దగ్గరకు వెళ్ళి, నేను ఏ జీవినైతే కుట్టుతానో... ఆ జీవి చనిపోవాలని వరం కోరిందట. తథాస్తు అన్నాడు దేవుడు.

విషయం తెలిసిన చీమ కూడా వెళ్ళిందట. నేను కుట్టిన వెంటనే చనిపోవాలందిట. దేవుడు నవ్వుకుంటూ తథాస్తు అన్నాడు.

చాలా తెలివిగా వరం కోరుకుంది పాము. (అందుకే కాబోసు జ్ఞానికి ప్రతీకగా పాముని గురించారు ఆర్యులు. ఆవేశపు చీమ కుట్టగానే తనే చస్తుంది. దీన్ని శ్రమ జీవిగా గుర్తించినట్లు జ్ఞాపకం)

బద్దెన కవి ఏమన్నాడు!? - తన పద్యంలో... 'చీమలు పెట్టిన పుట్టలు పాముల కిరువైనయట్లు'.... మరి వీటి రెండింటి మధ్య ఈ వ్యత్యాసం చూసేనేమో -

'బలవంతమైన సర్పము చలిచీమల చేత చావదె సుమతీ' అంటూ చీమలకు ఒక రకమైన న్యాయం చేకూర్చాడు, సుమతీ శతక కారుడు మరో పద్యంలో.

'బలవంతమైన న్యాయం చేకూర్చేడు. సుమతీ శతక కారుడు మరో పద్యంలో అలా అలా' ఏవో ఊహలు చేసుకుంటూ నిద్రలోకి జారిపోయేడు నారాయణ.

✡✡✡

చీమల లోకంలోకి వెళ్ళిపోయేడు నారాయణ. అక్కడ కన్నవీ.. విన్నవీ -

అక్కడ ఉపన్యాసకులూ, పంతుళ్ళూ, పాలకులూ, పాలితులూ లేరు. మార్గదర్శకులూ మతప్రవక్తలూ కనిపించలేదు. వ్యాపారులు లేరు. న్యాయస్థానాలు లేవు. సహజీవనమే వాటి గమ్యం. ఇలా... చీమలు కోట్లాది సంవత్సరాలై అవిచ్ఛిన్నంగా జీవిస్తున్నాయట...

చీమలకు వ్యక్తిగత బాధ్యత సమిష్టి బాధ్యత ఒకరు నేర్పినవి కావట. క్రమశిక్షణ, సంఘశ్రేయస్సు కొరకు ఆత్మార్పణ అనేవి పుట్టుకతో వచ్చిన మంచి లక్షణాలట. వేటి పని అవి ఐచ్ఛికంగా, యాంత్రికంగా చేసుకుపోతాయట... మానవుల్లో లాగే చీమల్లో కూడా కొన్ని పని దొంగలుంటాయట. ఇవి వీలు దొరికినప్పుడల్లా మోస్తున్న ఆహారాన్ని గుటకాయ స్వాహా అని దిగమింగుతాయట.

చీమల దూర దృష్టి అద్భుతమైనది. బారులుగా బయలుదేరి ఆహారయాత్రలు చేస్తాయి. అనుకూల ఋతువులలో ఆహారాన్ని నిల్వచేసుకుని కష్టకాలంలో దానిని వాడుకుంటాయిట. పుట్టలలో వాటికి ఆహారపు గాదెలు ఉంటాయి.

మానవుల్లాగే చీమలు కూడా యుద్ధాలు చేస్తుంటాయి. ఈ యుద్ధాలు కూడా ఆహారపు నిల్వల కోసమో, బానిసల కోసమో చేస్తుంటాయట.

ఒక జాతి నిల్వల కోసం మరో జాతి చీమలు దాడి చేసి యుద్ధం చేస్తాయిట నిల్వలు కొల్లగొడతాయట.

మానవుల్లాగే చీమల సంఘంలో కూడా బానిస విధానం దాపురించిందట. అమెరికాలోని ఒకరకమైన చీమలు సోమరివట. వీటికి పని చేయించుకోవటం తప్ప చెయ్యడం తెలియదు. ఇవి ఒక రకమైన కీటకాలు గూళ్ళపై దాడి చేసి వాటి గుడ్లనూ, కళ్ళు తెరవని పసి బిడ్డలనూ తస్కరిస్తాయి. అవి పుట్టగానే వాటిని బానిసలుగా మార్చుకుంటాయట. వాటి పాలు పిండుకుని తాగుతాయట. ఇతర పనులు చేయిస్తాయట. ఈ బానిసల కోసం కూడా యుద్ధాలు చేస్తాయిట.

"నాయనా!...టీ" అన్న దాలమ్మ పిలుపుతో బలవంతంగా బాహ్య ప్రపంచంలోకి వచ్చాడు - నారాయణ.

✡✡✡

చీకటి పడుతోంది - ఎరకయ్యా, అమ్మ వీధిలోంచి గబగబా వచ్చారు.

"గురువుగారూ! మీరు అర్జంటుగ బయలుదేరాలి. అమ్మగారికి బాగోలేదట. ఆఫీసుకి ఫోనొచ్చింది. గాభరా పడవలసిన పనేమీ లేదు. మిమ్మల్ని దిగవిడిచి, ఈ రాత్రికే నేను వెనక్కి వచ్చేయాలి" అన్నాడు హడావుడిగా.

"ఫరవాలేదు ఒక్కడ్నే వెళ్ళిపోగలన"ని ఇంటిల్లిపాదినీ ఒప్పించేసరికి తల ప్రాణం తోక కొచ్చేసింది - నారాయణకి. అతని సామాన్లు తానూ కూతురు సర్దుతూ -

"మీరెందుకు వచ్చేరో నాకు తెలుసు. అమ్మి... కోడలు పిల్లల విషయమై అమ్మి దాని అభిప్రాయం చెప్పే ఉంటుంది. ఇహ కోడలు - మెరిట్‌లో సీటు కాకపోతే, కోటాలో వస్తే ఒక ఏడాది కలిసొచ్చినా కలిసొస్తుంది కదా - అని ఆవిడ ప్రలోభం. అంతే.. ఆమెకు విషయాలు అంత వేగంగా ఇంకవు. మీకు తెలియందేముంది!" అంటూ నారాయణ బయల్దేర దీసేడు ఎరకయ్య.

అతగాడిని బిగికౌగిలిలో బంధించి వదిలేసేడు. నారాయణ అమ్మిని పిలిచి 'కీప్ ఇట్ అప్' అంటూ అమ్మి నుదుటున ముద్దు అద్దేడు. 'వస్తానమ్మా! నేనొచ్చి వెళ్ళేనని కోడలికి కబురంపు' అన్నాడు దాలమ్మను ఉద్దేశిస్తూ - అన్నీ సర్దుకుపోతాయిలే అన్న భరోసానిస్తూ.

ఎక్కడినుంచో ఘంటసాల భగవద్గీత వినవస్తోంది. అది ఆగి -

"శ్రీ శ్రీ శ్రీ నూకల సుధాకరానంద స్వామివారి ఉపన్యాసం ఇంకొద్ది నిముషములలో ప్రారంభం కానున్నది. కావున భక్తకోటికిదే మా ఆహ్వానం" వినవస్తోంది.

వీధి చివర ఆటో ఎక్కేడు - నారాయణ మిగిలిన వాళ్ళు అతనికి వీడ్కోలు చెప్పారు. గణార్చన గురించి ప్రసంగిస్తారు. కావున... ” ఉదయం అమ్మి ఇచ్చిన కాగితం తీసి చూసేడు. మళ్ళీ చదివాడు. నవ్వుకుంటూ రోడ్డు మీద జారవిడిచాడు.

గతుకుల రోడ్డుమీద ఆటో ఊగిసలాడుతూ పోతోంది. అరగంట ప్రయాణం కళ్ళు మూసుకున్నాడు. కునుకు పట్టసాగింది - నారాయణకు.

✡✡✡

మగత నిద్రలో.. ఓ గుట్ట... గుట్ట మీద ఓ గుడి... గుడి చుట్టూ స్త్రీలు.. స్త్రీల చేతుల్లో రకరకాల పాత్రల్లో వారి వారి శక్త్యానుసారం నూకలో, చక్కరో,

ఊర్లోంచి గుట్ట మీదకి స్త్రీలు వరస కట్టుకున్నారు. పురుషులు అక్కడొకరూ ఇక్కడొకరూ. గుట్ట మీదకి భక్తులను బేచ్‌బేచ్‌లుగా పంపుతున్నారు కార్యకర్తలు.

కష్టాలన్నీ అబలలుకే!... గణార్చన చేస్తున్నది వారే! వారు స్త్రీలేనా!? కొన్ని చీరల మరుగున దాగినవి.. అవేంటి!? తెల్లగా ఉన్నాయి - ఖద్దరు వస్త్రాలులాగా ఉన్నాయి... మేలి ముసుగు క్రింద గాంధీ టోపీలున్నాయి... ముఖాలు గుబురు మీసాలతో భయంకరంగా ఉన్నాయి. ఎర్రెర్రని కళ్ళు.. మత్తెక్కిన కళ్ళు... కాంక్షల కళ్ళు...

చీమల పుట్టల్లో ఆహారపు నిల్వలు పొంగి పొర్లుతున్నాయి. చీమలు ఆహార యాత్రలు చేయటం లేదు - సునాయాశ లబ్ధి. అవి కష్టపడటం లేదు. సోమరులవుతున్నాయి.

స్వామివారు, ఇంకో ఊరికి తరలి పోయారు. సంతర్పణాలు ఆగిపోయాయి. నిల్వలు తరగసాగాయి. పరిస్థితి చేజారుతుందన్నప్పుడు చూసుకుందామన్న అలసత్వం పెరిగిపోతోంది. అయాచిత లబ్ధి చీమలకు.

గుట్టక్రిందా, ఊరిలోనూ చీమలకు ఆహారం లేదు. అవి ఈ పుట్టలమీద దాడి జరపసాగాయి. సోమరి చీమలు పరాజయం పాలయ్యాయి. వాటి నిల్వలు కొల్లగొట్టబడ్డాయి.

క్షతగాత్ర చీమలు... చెట్లు పట్టి, కొన్నాళ్ళకు.. బుద్ధి కలిగి, తిరిగి తమ తమ పుట్టలు చేరి సరికొత్త జీవితం ప్రారంభించసాగాయి.

స్వామివారు మళ్ళా వేంచేసారు. భక్తులు మళ్ళా పుట్టలు చేరారు.

సోమరి తనం పూర్తిగా వదలని చీమలు ఆశపడబోయి.... ఒకసారి తగిలిన చావుదెబ్బ గుర్తుకొచ్చి సంతర్పణలు అందుకోవటం లేదు.. పుట్టల్లోకి ఆత్రంగా చూస్తున్న భక్తుల కాళ్ళ క్రిందకు చేరాయి.. ఆపైన కసిగా కుట్టసాగాయి.

అమ్మి, మీకంతే కావాలి... మీకంతే కావాలి - అన్నట్లు కేరింతలు వేస్తూ చీమల్ని ప్రోత్సహిస్తోంది.

అమ్మో! అంటూ సంతర్పణ కర్తలు పరుగులు పెట్టసాగారు.

నల్లచీమలు... చిన్ని చీమలు అర్భక చీమలు కుట్టటమేమిటి? అనుకున్న నారాయణకు తెలివొచ్చింది.

తమ స్వలాభాపేక్షతో గర్జన చేస్తూ, తమ మనుగడికే ముప్పు తెచ్చేవారిపై అవి ఎందుకు యుద్ధం ప్రకటించకూడదూ!? అవి ఎంత సాధు జీవులైనా!

‘ఆడ చీమలొస్తున్నాయ్! కుడతాయి జాగ్రత్త!‘ అన్నాడు అప్రయత్నంగా నారాయణ

‘అవి కుట్టాలి! లేకపోతే వాటికి భవితవ్యం లేదు‘ అని గొణుక్కున్నాడు అతను .

✡✡✡